క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ విజయసాయిరెడ్డిని రామ్మూర్తినగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్రాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రాంతీయ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి సిద్దన సుబ్బారెడ్డి, ఏపీ జాయింట్ సెక్రటరీ ధన్‌పాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృసేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నెల్లూరు(అర్బన్): నారాయణ మాతృసేవా పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ కోరారు. ప్రపంచ మహిళా దినోత్సవంతో పాటు నారాయణ మాతృసేవా పథకం 8వ వార్షికోత్సవ వేడుకలను నారాయణ ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. దీపా వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాతృసేవా పథకం కింద గర్భిణులకు ఉచితంగా కాన్పులు చేయడమే కాకుండా బేబీ కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉమన్ హెల్త్ చెకప్ పోస్టర్లు విడుదల చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 7వ తేదీ వరకు 35 ఏళ్లు నిండిన మహిళలకు రూ.6,500 విలువైన ఆరోగ్య పరీక్షలను రూ.2,499కే చేస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గైనకాలజీ హెడ్ ప్రసన్న, వైద్యులు మంజుప్రభ, రాధిక, శారద, మాధవీలత పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు(బృందావనం): మహాత్మాగాంధీ నగర్ శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో కొలువైన శ్రీవైభవలక్ష్మి ఆలయంలో 9వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తగా మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

ఎన్‌ఎక్స్ ఫ్లోరర్స్ కార్నివాల్



నెల్లూరు (టౌన్): నగరంలోని భవాని హోటల్‌లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎక్స్ ఫ్లోరర్స్ కార్నివాల్‌ను గురువారం నిర్వహించారు. జిల్లాలోని 43 ప్రభుత్వ పాఠశాలల నుంచి 140 మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్నివాల్ విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను రేకెత్తిస్తుందన్నారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల జీవితాలను అధ్యయనం చేయాలి



నెల్లూరు (టౌన్): స్వాతంత్ర సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి వంటి వారి జీవితాలను యువత అధ్యయనం చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నగరంలోని కస్తూరీదేవి స్కూల్‌లోని రవీంద్రనాథ్‌ఠాగూర్ ఆడిటోరియంలో కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పుస్తక రచయిత అనంత పద్మనాధరావు, పుస్తకాన్ని రూపొందించడానికి చొరవ తీసుకున్న కోదండరామిరెడ్డి కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు. కోదండరామిరెడ్డి విగ్రహ ఏర్పాటు, కనుపూరు కాలువకు ఆయన పేరును తీసుకొచ్చే దిశగా చొరవచూపుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, కోదండరామిరెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి, కోవూరు, నెల్లూరురూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమించారు. ఉదయగిరికి మాజీ జెడ్పీచైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కోవూరుకు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరురూరల్‌కు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డిని నియమించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు(పొగతోట): ఆధునిక యుగంలో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ట్రెయినీకలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతర ట్రెయినీ కలెక్టర్‌ను సన్మానించారు. ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, డీపీఓ సుస్మితారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐసీడీఎస్ పీఓ మందారాణి పాల్గొన్నారు.



ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హాకు సన్మానం

ఉపాధ్యాయినులకు సత్కారం

నెల్లూరు (టౌన్): ఏసీనగర్‌లోని ఎంఎస్ఎం స్కూల్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి రాజకుమార్, హెచ్ఎం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు రోడ్డులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రజాసత్తా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శోభన్‌బాబు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, గురుకులం ప్రిన్సిపల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ ఆధ్వర్యంలో..

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ జే సుజాతబాయి, కన్వీనర్ స్నేహ ఆధ్వర్యంలో నగరంలోని జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశిష్టఅతిథులుగా ఏపీజీఈఏ రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ బీ సుగుణ, ఏసీఎస్సార్ వైద్యకళాశాల చైర్‌పర్సన్ లక్ష్మీసునంద, డీపీహెచ్ఎన్ఓ జీ మంజుల, నర్సింగ్ సూపరింటెండెంట్ సువార్తమ్మ, డీ రేచల్, తదితరులు హాజరయ్యారు. క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వై రమణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్న పలువురు మహిళా సేవకులను ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ, స్పాస్టిక్ సెంటర్ కోకన్వీనర్ బలరామనాయుడు, ప్రిన్సిపల్ గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: ప్రజారవాణా శాఖ నెల్లూరు రీజియన్‌లో ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులకు రీజనల్ మేనేజర్ పీవీ శేషయ్య నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆర్ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్‌భవన్‌లోని ఎస్ఈ చాంబర్‌లో మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శేషాద్రిబాలచంద్ర, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, తదితరులు, పాల్గొన్నారు.

• దివ్యాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో 54వ డివిజన్ పరిధిలోని వార్డు సచివాలయం-2లో మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జక్కావుల్లా, శీనయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎస్ఎం స్కూల్‌లో ఉపాధ్యాయినులకు సన్మానం



గిరిజన బాలికల గురుకులంలో..



54వ డివిజన్‌లో సచివాలయ ఉద్యోగులకు సన్మానం



ఏపీజీఈఏ ఆధ్వర్యంలో..



ప్రజారవాణా శాఖ కార్యాలయంలో..



రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో..



విద్యుత్‌భవన్‌లో..

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని కందమూరు దళితవాడ, ఉప్పుటూరులో గురువారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కందమూరు దళితవాడలో రూ.4 లక్షలతో నిర్మించిన రచ్చబండను ప్రారంభించి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ దేశంలో మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తాయని భావించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాలనకు, నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న తేడాను ఒక్కసారి ప్రజలందరూ గమనించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, కందమూరు ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, ఉప్పుటూరు సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి ,పార్టీ నాయకులు శ్రీనివాసులునాయుడు, రవినాయుడు, మహేశ్వర్‌నాయుడు, చేవూరు గీత, దాచూరు కృష్ణయ్య, పల్లం జాన్, శ్రీధర్ నాయుడు, వల్లభనేని రవణమ్మ, పాతపాటి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గం 31వ డివిజన్‌కు చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నగరంలోని ఎంపీ నివాసంలో పార్టీలో చేరిన షేక్ నూర్జహాన్, షేక్ రిజ్వాన్, షేక్ రేష్మ, ఎండీ హీరాభాను, షేక్ రియాజ్, కాలేషా, షేక్ జంషీర్, షేక్ గౌస్‌బాషా, కరిష్మా, గౌసున్నీసా, ఫైరోజ్, హబీబ్, తాజు, తదితరులకు ఎంపీ ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకురాలు షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ తాము ఇప్పటి వరకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వెంట ఉన్నామని, ఎంపీ ఆదాల రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుండడం చూసి వైఎస్సార్‌సీపీలో చేరామని స్పష్టం చేశారు. పార్టీ 31వ డివిజన్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు నాయబ్ రసూల్ ఖాదర్ మస్తాన్, సతీష్, చంద్ర, ఉదయ్, శశి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, నాయకులు పొట్లూరు జయవర్ధన్, మైపాడు అల్లాబక్షు, బెల్లంకొండ వెంకయ్య పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఈఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మరమ్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో నగర నియోజకవర్గం-117 పరిధిలోని ఎన్నికల సిబ్బందితో సమీక్షను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రకటన తేదీ నుంచి ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. తనిఖీల్లో మద్యం, ధనం, మారణాయుధాలు పట్టుబడిన సందర్భాల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రొసీజర్‌ను వివరించారు. అనంతరం శిక్షణ పొందిన ఎన్నికల సిబ్బంది తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అదనపు కమిషనర్ శర్మద, ఏఈఆర్వోలు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రవర్తన నియమావళిని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పకుండా పాటించాలని ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ టీ బాపిరెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోస్టల్ బ్యాలెట్లు, ఎన్నికల వ్యయం తదితర అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ఖర్చులను ఎన్నికల సంఘానికి తెలియజేయాలన్నారు. పార్టీ ఆఫీసుల ఏర్పాటు, ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, లేని పక్షంలో సీజ్ చేస్తామని తెలిపారు.

నెల్లూరు(పొగతోట): ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే ప్రతి పొలిటికల్ అడ్వర్టైజ్‌మెంట్‌ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సూచించిన తర్వాతే ప్రసారం చేయాలని ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ బాపిరెడ్డి సూచించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులు, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్లకు ఆయన శిక్షణ ఇచ్చారు. అనుమతి తీసుకోకుండా ప్రసారం చేస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మీడియా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాలని, ఓటర్లను చైతన్య పరిచే విషయంలో కీలక పాత్ర వహించాలన్నారు. ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ కే సదారావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, ఎన్ఐసీడీ ఐఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

నెల్లూరు(అర్బన్): వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న 2,146 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమబద్ధీకరించడంపై ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొత్త వెలుగులు ప్రసాదించిన సీఎంతో పాటు అందుకు కృషి చేసిన సంఘ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల బరిలో ఎమ్మార్పీఎస్

నెల్లూరు(వేదాయపాళెం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో ఎమ్మార్పీఎస్ అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య తెలిపారు.గురువారం దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో నెల్లూరులో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌పై అసత్య ఆరోపణలు తగవు

నెల్లూరు(దర్గామిట్ట): నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తగదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ అన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తాను సాధారణ వ్యక్తిని అని పలుమార్లు బాహాటంగా తెలిపారని గుర్తుచేశారు. 2008 కార్పొరేషన్ ఎన్నికల్లో, ఆ తరువాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ నాయకుడు అనిల్ ఏనాడు ఎంపీ వేమిరెడ్డి ఇంటివైపు చూడలేదన్నారు. వేమిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు అనిల్‌పై కోటంరెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కోటంరెడ్డి కోసమే తమ నాయకుడు అనిల్ ఆనం కుటుంబాన్ని వీడారని, అది ఆయనకు గుర్తులేదా అని ప్రశ్నించారు.

కేతంరెడ్డికి విమర్శించే అర్హత లేదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను విమర్శించే అర్హత రోజుకో పార్టీ మారే కేతంరెడ్డి వినోద్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు బాగి వెంకటరమణ అన్నారు. 53వ డివిజన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేమిరెడ్డి ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి కేతంరెడ్డి తమ ఎమ్మెల్యే అనిల్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు.ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జగనన్న ఆశీస్సులతో రాష్ట్రంలోని ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసి గెలుపొందే సత్తా తమ నాయకుడికి ఉందన్నారు. పార్టీ నాయకులు దేవరకొండ ఆదిశేషయ్య, ప్రభాకర్, తిరుపతయ్య, నాగరాజు, భీముడు, రమేష్, తదితరులు, పాల్గొ న్నారు.

వైభవంగా రావణసేవ



వెండి రావణునిపై మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(బృందావనం): మూలాపేట మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలోని మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రావణసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు , హోమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మేడికొండ పద్మమోహన్,స్నేహ దంపతులు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీకే ముస్లింల మద్దతు

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ముస్లింలు ఎవ్వరూ ఓటేయరని, వారి మద్దతు వైఎస్సార్‌సీపీకేనని మైనార్టీ నేత సమీర్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ విజయసాయిరెడ్డి పర్యటనకు నెల్లూరు రూరల్‌లో వచ్చిన స్పందనను చూసి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ముస్లింలు ఓటు వేయొద్దని ఓ వ్యక్తితో కోటంరెడ్డి మాట్లాడించారన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చి మాజీ మేయర్ అబ్దుల్‌అజీజ్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన సీటును లాక్కునందుకు ముస్లింలు నీకు ఓట్లు వేయాలా అని కోటంరెడ్డిని ప్రశ్నించారు. రూరల్ నియోజకవర్గంలోని ప్రతి ముస్లిం తన ఓటును వైఎస్సార్‌సీపీకే వేయనున్నారని, 30వేలకుపైగా ఓట్లతో ఆదాల గెలవబోతున్నారని పేర్కొన్నారు.

శివ జయంతి శోభాయాత్ర



నెల్లూరు(వేదాయపాళెం): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా వేదాయపాళెంలోని బ్రహ్మకుమారి కేంద్ర కార్యాలయం నుంచి అయ్యప్పగుడి సెంటర్ వరకు శివజయంతి శోభాయాత్రను గురువారం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి బీకే ప్రసన్న యాత్రను ప్రారంభించి మాట్లాడారు. శివరాత్రి ఆరోగ్యానికి, ఆత్మ విశ్వాసానికి ప్రతీకని పేర్కొన్నారు. శివరాత్రిని పురస్కరించుకుని ద్వాదశ లింగాన్ని ఏర్పాటు చేశామని భక్తులు దర్శించుకోవాలని కోరారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, అజంతా స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మకుమారీలు సుమతి, నిర్మల, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి అవార్డుల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పుర మందిరంలో శనివారం సాయంత్రం 5 గంటలకు మహిళా శక్తి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పొగతోటలో గురువారం ఆవిష్కరించారు.

నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నిర్దేశించిన 130 మైక్రాన్ల కన్నా తక్కువ స్థాయి ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. నగరంలోని చిన్నబజార్, శిఖరంవారి వీధి, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయ దుకాణాలపై గురువారం ఆయన దాడులు నిర్వహించారు. 80 కిలోల నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను గుర్తించి సీజ్ చేశారు. దుకాణాల యజమానులకు రూ.40వేలు జరిమానా విధించారు. మరోసారి నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలు జరిపితే దుకాణాలను శాశ్వతంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిషేధిత ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం, కొనుగోలు చట్టవ్యతిరేకమైన చర్యలని, ప్రజలంతా అవగాహన పెంచుకుని బాధ్యతగా ప్రవర్తించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు షరీఫ్, ఆశీర్వాదం, అశోక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.